క్లుప్తంగా

వినూత్నను అభినందించిన మంత్రి సురేష్



వినూత్నను అభినందిస్తున్న మంత్రి సురేష్

ఒంగోలు: సివిల్స్‌కు ఎంపికైన ఒంగోలుకు చెందిన బి.వినూత్నను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గురువారం అభినందించారు. ఒంగోలులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా మంత్రిని కలిసిన వినూత్నకు స్వీటు తినిపించి శాలువా కప్పి సత్కరించారు.

కాలువల్లో పూడికతీత



కాలువలో పూడిక తీస్తున్న మున్సిపల్ వర్కర్లు

చీమకుర్తి: పట్టణంలోని ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు చేపట్టినట్లు కమిషనర్ షేక్ ఫజులుల్లా గురువారం తెలిపారు. ప్రతి ఏడాది వర్షాకాలం ప్రారంభానికి ముందుగా కాలువల్లో పూడికతీత పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. వర్షాలకు కాలువల నుంచి వరద నీరు రోడ్ల మీదకు, ఇళ్లలోకి రాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా కాలువల్లో పూడికతీత పనులు చేస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ కాలనీ, ఇసుకవాగు, బస్టాండ్, అగ్రహారం రోడ్డు, అర్చన హోటల్ సమీపాలలోని ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

వలంటీర్లకు సత్కారం



వలంటీర్లను సత్కరిస్తున్న దుంపా చెంచిరెడ్డి, సర్పంచ్ శైలజ

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం మద్దులూరులో 19 మంది వలంటీర్లను సేవారత్న అవార్డులతో గురువారం సత్కరించారు. స్థానిక సర్పంచ్ మైనం శైలజ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి చేతుల మీదుగా వలంటీర్లను సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


బీజేపీ పాలనలోనే దళితులకు మేలు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి

ఒంగోలు: భారతీయ జనతా పార్టీ పాలనలోనే దళితులకు మేలు జరిగిందని, కాంగ్రెస్ పార్టీ దళితులను కేవలం ఓటుబ్యాంకుగా వాడుకుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి అన్నారు. స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులు కాంగ్రెస్ పార్టీ వలలో చిక్కుకుని మోసపోయారన్నారు. దళిత ప్రయోజనాలను కాపాడే వ్యక్తి ప్రధాని నరేంద్రమోదీ మాత్రమేనన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యానం చినయోగయ్యయాదవ్, ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి పి.మోజే, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.అమరసింహ, ప్రధాన కార్యదర్శులు పుల్లయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న టిప్పర్



టిప్పర్ ఢీకొనడంతో దెబ్బతిన్న డివైడర్

ఒంగోలు టౌన్: డ్రైవర్ నిద్రమత్తు కారణంగా గురువారం తెల్లవారుజామున చీమకుర్తి వైపు నుంచి కంకర లోడుతో వచ్చిన టిప్పర్ స్థానిక కర్నూలు రోడ్డులో పీర్లమాన్యం వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుమారు ఐదు మీటర్ల మేర డివైడర్ ధ్వంసమైంది. డివైడర్‌పై ఏర్పాటు చేసిన షో లైట్లు, డివైడర్ బోర్డు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆ సమయంలో రోడ్డు మీద ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పారిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గాలివాన బీభత్సం



కొత్తపట్నం: సిమెంటు రేకులు ఎగిరిపోయిన ఇల్లు



కొత్తపట్నం: విరిగిపడిన విద్యుత్ స్తంభం

- ఒంగోలు, చుట్టుపక్కల ప్రాంతాల్లో అతలాకుతలం
- కొత్తపట్నం మండలంలో సుమారు 50 గృహాల పైకప్పు రేకులు ధ్వంసం
- ఆందోళనకు గురైన ప్రజానీకం

కొత్తపట్నం: ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో గురువారం మధ్యాహ్నం గాలివాన బీభత్సం సృష్టించింది. కొత్తపట్నం మండలంలోని పలు గ్రామాల్లో సుమారు 50 గృహాల పైకప్పు రేకులు ధ్వంసమయ్యాయి. చెట్లు, స్తంభాలు విరిగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. కొత్తపట్నం మండలంలోని ఆలూరు, గాదెపాలెం గ్రామాల్లో ప్రజలను గాలివాన భయాందోళనకు గురి చేసింది. కొప్పోలు – ఆలూరు మధ్యలో రోడ్డుపై చెట్లు విరిగిపడి రాకపోకలకు కొంతసేపు అంతరాయం కలిగింది. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. రెండు గ్రామాల్లో విద్యుత్ నిలిచిపోయి రాత్రి వరకూ సరఫరా రాకపోవడంతో గ్రామస్తులు చీకట్లో గడిపారు. సర్పంచ్ పూనూరి మాధవి, శైషలేష్, గ్రామస్తులు స్పందించి రహదారులపై పడిన చెట్లను పొక్లెయిన్‌తో తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. తెగిపోయిన వైర్లకు విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఇళ్ల పైకప్పుగా ఏర్పాటు చేసుకున్న రేకులు ఈదురుగాలికి లేచిపోయి పగిలిపోయాయి. ఇళ్లలోని సామగ్రి కూడా గాలికి ఎగిరిపోయి వర్షానికి తడిచిపోవడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. నష్టపరిహారం చెల్లించాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కరవదిలో పిడుగు...

ఒంగోలు రూరల్: ఒంగోలు మండలంలోని కరవది గ్రామంలో పిడుగుపడింది. బీసీకాలనీలో కొబ్బరిచెట్టుపై పిడుగు పడి ఆ చెట్టు కాలిపోయింది. గురువారం సాయంత్రం పెనుగాలులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. విద్యుత్ సరఫరాకు రాత్రి వరకు అంతరాయం కొనసాగింది. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి.

మద్దిపాడు మండలంలో...

మద్దిపాడు: మద్దిపాడుతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు గంటకుపైగా కురిసిన వర్షానికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే రహదారి, గ్రామంలోకి ప్రవేశించే రెండు మార్గాల్లో మోకాలిలోతు నీళ్లు నిలిచిపోయి వాహనదారులు ఇబ్బంది పడ్డారు. మూడు రోజుల క్రితం వర్షం కురిసినా మరుసటి రోజు నుంచి ఎండ తీవ్రతరం కావడంతో ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గురువారం కూడా మధ్యాహ్నం వరకు ఎండ మండిపోయింది. అనంతరం కురిసిన వర్షానికి ప్రజలు సేదతీరారు. వరుస వర్షాల నేపథ్యంలో రైతులు వ్యవసాయానికి సిద్ధమవుతున్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ



రిమ్స్ వద్ద దాడిలో ధ్వంసమైన బిల్లా చెన్నయ్య కారు



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వెంకటరావు



చికిత్స పొందుతున్న బ్రహ్మేశ్వరరావు

- ఒకరి కారుపై మరొకరు దాడి
- రెండు కార్లు ధ్వంసం

ఒంగోలు టౌన్: చిన్న సమస్య చినికి చినికి గాలివానగా మారింది. దీంతో ఇరువర్గాల వారు ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. కొత్తపట్నం మండలం మడనూరు గ్రామానికి చెందిన బిల్లా చెన్నయ్య, బిల్లా వసంతరావు మధ్య వలంటీర్ పోస్టింగ్ విషయంలో కొద్ది రోజులుగా వివాదం నెలకొంది. అది కాస్తా ముదిరి పాకానపడటంతో ఇరువర్గాల వారు గురువారం ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. బిల్లా వసంతరావుకు దగ్గరి బంధువు అయిన రంగిశెట్టి బ్రహ్మేశ్వరరావు మడనూరు సచివాలయం పరిధిలో వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. తన సోదరుడు బ్రహ్మనందంతో కలిసి కారులో ఒంగోలు వస్తుండగా టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెం వద్ద రైల్వే గేటు పడి రోడ్డు పక్క కారు ఆపి ఉన్నారు. అప్పటికే అక్కడ వేచి ఉన్న బిల్లా చెన్నయ్య తన వర్గీయులతో కలిసి బ్రహ్మేశ్వరరావు, బ్రహ్మనందంల కారుపై దాడి చేశాడు. అందులో ప్రయాణిస్తున్న బ్రహ్మేశ్వరరావుపై కూడా దాడి చేసి కొట్టారు. ఈ దాడిలో కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. అనంతరం ఒంగోలులోని రిమ్స్ వద్దకు చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న వసంతరావు వర్గీయులు రిమ్స్ వద్దకు చేరుకుని అక్కడున్న చెన్నయ్య కారుపై దాడి చేశారు. కారు డ్రైవర్ బత్తుల వెంకటరావుపై కూడా దాడికి పాల్పడ్డారు. ఈ దాడుల్లో ఇరువర్గాలకు చెందిన బ్రహ్మేశ్వరరావు, బత్తుల వెంకటరావుకు గాయాలవడంతో రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. బిల్లా చెన్నయ్య, ఆయన సోదరుడు శ్రీనివాసరావు, భార్య విజయలక్ష్మి మరికొందరు కలిసి తనపై దాడి చేసినట్లు బ్రహ్మేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేయగా, బత్తుల వెంకటరావు మాత్రం తనపై ఎవరు దాడి చేశారో తెలియదని చెబుతున్నాడు. సమాచారం అందుకున్న ఒంగోలు వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై కృష్ణయ్య తమ సిబ్బందితో కలిసి రిమ్స్‌కు చేరుకుని విచారిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆర్థిక లావాదేవీల నేపథ్యంలోనే గొడవ జరిగినట్లు మరో వాదన వినిపిస్తోంది.

శ్రీవారికి చక్రస్నానం



ఊంజల సేవలో స్వామివారు

ఒంగోలు టౌన్: నగరంలోని కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠపాలిత శ్రీగిరి శ్రీవెంకటేశ్వరస్వామి త్రయాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరాంకుశం సీతారామాచార్యుల బృందం ఆధ్వర్యంలో గురువారం యాగశాల పూజలు, ప్రాకారోత్సవం, చూర్ణోత్సవం, విశేష స్నపన తిరుమంజన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీవారి చక్రస్నానాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో దేవాలయ ప్రాంగాణం కిక్కిరిసిపోయింది. సాయంత్రం ధ్వజావరోహణ, పూర్ణాహుతి, కుంభ ప్రదక్షణము, అక్షతారోహణము, ఆచార్య సన్మానములు జరిగాయి. శ్రీవారి ఊంజల సేవను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సంగీత కచేరి వీనుల విందుగా సాగింది. విశాఖపట్నానికి చెందిన చైతన్య బ్రదర్స్ పాడిన భక్తిరస గేయాలు అలరించాయి. ముఖ్యంగా ప్రసిద్ధ వాగ్గేయకారుల కీర్తనలను మృదు మధురంగా గానం చేసి భక్తులకు ఆధ్యాత్మిక రసానందాన్ని పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఆలూరు వేంకట రమణారావు, అర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్యనిర్వాహక ధర్మకర్త రామకృష్ణారావులు చైతన్య బ్రదర్స్‌ను ఘనంగా సత్కరించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.


ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఐద్వా, ప్రజాసంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: మహిళా రెజ్లర్లపై లైంగిక దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కీచక బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని కోరుతూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా గురువారం ఒంగోలులోని అద్దంకి బస్టాండ్ సెంటరులో సీఐటీయూ, ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనకు సీఐటీయూ నగర నాయకుడు కొర్నెపాటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ మహిళా రెజ్లర్లు సాధించిన పతకాలు మనవైనప్పుడు వారి కన్నీళ్లు కూడా మనవి కావా అని ప్రశ్నించారు. అహర్నిశలు కష్టపడి సాధించుకున్న పతకాలను గంగలో పడేసేందుకు సిద్ధపడ్డారంటే.. వారి ఆవేదనను అర్థం చేసుకోవాలన్నారు. దేశ రాజధానిలో 40 రోజులుగా దీక్షలు చేస్తున్న రెజ్లర్ల విషయంలో జోక్యం చేసుకోకుండా మౌనం వహిస్తున్న ప్రధానమంత్రి మోదీ పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవానికి బ్రిజ్ భూషణ్‌ను ఆహ్వానించడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయమన్నారు. రెజ్లర్లపై లైంగికదాడుల ఘటనపై సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ చేయించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని దళితులు, మైనార్టీలు, మహిళల మీద దాడులు పెరిగిపోయాయన్నారు. మహిళా మల్లయోధుల ఉద్యమానికి దేశ ప్రజలంతా మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కె.అంజమ్మ, పి.జయమ్మ, సీహెచ్ మార్తమ్మ, పి.రమణమ్మ, శ్రీరాం శ్రీనివాసరావు, నెరుసుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

‘పశువుల బీమా’ సద్వినియోగం చేసుకోవాలి



పశువైద్యాధికారిణి శోభ

అల్లూరు (కొత్తపట్నం): పశువుల బీమా పథకంలో సరికొత్త విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని అల్లూరు పశువైద్యాధికారిణి డాక్టర్ వి.శోభ సూచించారు. అల్లూరు పశువైద్యశాలలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పథకం వివరాలను ఆమె వెల్లడించారు. కొత్త విధానంపై పశుపోషకులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పశుపోషకులకు లాభాదాయకమైన బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అల్లూరు గ్రామ పరిధిలో ఆలూరు, గాదెపాలెం, అల్లూరు గ్రామాల్లో 2,445 గేదెలు, 345 ఆవులు, 1,400 గొర్రెలు ఉండగా, వాటన్నింటికి రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు, నత్తల నివారణ మందులు, సీజనల్ వ్యాధుల నివారణకు ఇప్పటికే టీకాలు ఇచ్చామన్నారు. పశు బీమా పథకంలో ఎస్సీ, ఎస్టీ, తెల్లరేషన్ కార్డు కలిగిన రైతులకు ఒక గేదె రూ.384 ప్రీమియం చెల్లిస్తే మూడు సంవత్సరాల కాలపరిమితి వర్తిస్తుందన్నారు. మధ్యలో గేదె మరణిస్తే రూ.30 వేలు బీమా పొందవచ్చన్నారు. తెల్లరేషన్ కార్డు లేకుండా ఓసీలు, బీసీలైతే రూ.960 ప్రీమియం చెల్లిస్తే మూడు సంవత్సరాల కాలపరిమితి వర్తిస్తుందన్నారు. మధ్యలో గేదె మరణిస్తే రూ.30 వేలు బీమా వర్తిస్తుందన్నారు. గొర్రెలకు సంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ, తెల్లరేషన్ కార్డు ఉన్న రైతులకు ఒక గొర్రెకు రూ.36 ప్రీమియం చెల్లిస్తే రూ.6 వేలు బీమా పొందవచ్చన్నారు. ఓసీ, బీసీలకు రూ.90 ప్రీమియం చెల్లిస్తే రూ.6 వేలు ప్రమాద బీమా పొందవచ్చని తెలిపారు. గేదె, గొర్రెలు, ఆవుల ఖరీదును బట్టి ప్రీమియం చెల్లిస్తే అదనంగా బీమా కూడా పొందవచ్చని డాక్టర్ శోభ వివరించారు. పశుపోషకులు స్థానిక పశువైద్యాధికారిని సంప్రదించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అడిగిన ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు ఇవ్వాలి

- ఏపీడీ వెంకటస్వామి

మద్దిపాడు: ఉపాధి హామీ పనులు చేస్తామంటూ అడిగే ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు ఇవ్వాలని ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ వెంకటస్వామి ఏపీవోను ఆదేశించారు. మండలంలోని కొలచనకోట, నేలటూరు పొలాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పనులు చేయడానికి ముందుకొచ్చే వారందరికీ వెంటనే జాబ్‌కార్డులు ఇప్పించి పని కల్పించాలని ఆదేశించారు. ఉపాధి హామీ కూలీలు అధికారులు చెప్పిన కొలతల ప్రకారం పనులు చేస్తే ప్రతిరోజూ రూ.272 కూలి లభిస్తుందన్నారు. ఉపాధి పనులకు వచ్చే కూలీలకు ఒక షెల్టర్‌తో పాటు తాగునీటి సౌకర్యం కల్పించాలని, పని చేసే ప్రదేశాలలో ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని చెప్పారు. ఒకవేళ ప్రమాదం జరిగితే ప్రాథమిక చికిత్స అందించడానికి తప్పనిసరిగా కిట్లు దగ్గర ఉంచుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. ఉపాధి కూలీల మస్టర్ల విషయంలో ఏదైనా అవకతవకలు జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని ఏపీడీ హెచ్చరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, పలువురు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

దాతల సహకారంతో గురుకుల పాఠశాలకు ఇంటర్నెట్

చీమకుర్తి: స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాలకు లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీ జవహర్ అందించిన రూ.20 వేల ఆర్థిక సహాయంతో బీఎస్‌ఎన్‌ఎల్ ఇంటర్నెట్ కేబుల్ ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపారు. ప్రభుత్వం టెండర్ల ద్వారా ఇంటర్నెట్ సదుపాయం కల్పించడంతో పాఠశాల దూరంగా ఉందని, గిట్టుబాటు కాదని సంబంధిత కాంట్రాక్టర్ ముందుకు రాలేదన్నారు. దీంతో కేబుల్‌కు అయ్యే రూ.20 వేల ఖర్చును డాక్టర్ జవహర్ అందించారంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

3 నుంచి 9వ తరగతి వరకు దరఖాస్తుల ఆహ్వానం...

చీమకుర్తి పట్టణంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో 3 నుంచి 9వ తరగతి వరకు అర్హత కలిగిన విద్యార్థులను చేర్చుకునేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎస్టీ సామాజికవర్గానికి చెందిన పిల్లలను చేర్పించే తల్లిదండ్రులు చీమకుర్తి గరికమిట్టలోని గురుకుల పాఠశాలలో దరఖాస్తులు అందించాలని సూచించారు.

పింఛన్ల పంపిణీని పరిశీలించిన పీడీ

ఒంగోలు రూరల్: దసరాజుపల్లిలో పింఛన్ల పంపిణీని డీఆర్‌డీఏ పీడీ బాబూరావు గురువారం పరిశీలించారు. పలువురు లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం గోపీనాథ్, సర్పంచ్ శ్రీదేవి, కార్యదర్శులు రేవతి, కళ్యాణి, వైఎస్సార్ సీపీ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పోలేరమ్మకు పూజలు చేస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి దంపతులు నాయకులు

మద్దిపాడు: మండలంలోని తెల్లబాడు ఎస్సీకాలనీలో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భారీగా భక్తులు పాల్గొనగా, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీసులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని ఎంపీపీ ఆకాంక్షించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అందరూ సంతోషంగా ఉన్నారన్నారు. మండలంలోని ప్రతి రైతు పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలన్నదే తమ ఆశయమని అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రిని అందరూ దీవించాలని ఆమె కోరారు. ఆమె వెంట సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు బెజవాడ రాము, మండల అధ్యక్షుడు నారా సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గుడ్డపాతల రవి, విల్సన్, పైనం ప్రభాకర్, బొమ్మల రామాంజనేయులు, దొడ్డవరం ఎంపీటీసీ పద్మావతి, అశోక్, పలువురు పార్టీ కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దళితవాడల అభివృద్ధికి ఎంపీ నిధులు కేటాయించాలి



ఎంపీ నందిగం సురేష్‌తో మాట్లాడుతున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు

చీమకుర్తి: సంతనూతలపాడు నియోజకవర్గంలోని దళితవాడల అభివృద్ధికి ఎంపీ నిధులు కేటాయించాలని చీమకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు గురువారం బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఉద్దండరాయునిపాలెంలోని ఎంపీ నివాసంలో కలిసి మాట్లాడారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఎంపీ నిధులను కూడా కేటాయిస్తే దళితవాడల అభివృద్ధి జరుగుతుందన్నారు. గత ఎన్నికల్లో బాపట్ల పార్లమెంట్‌లో సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో కూడా అదే ఉత్సాహంతో మంచి మెజార్టీ వచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎంపీ నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరిస్తానని నందిగం సురేష్ హామీ ఇచ్చినట్లు జెడ్పీటీసీ శ్రీనివాసరావు తెలిపారు.

ఏపీజీబీ ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఏపీజీబీ ఉద్యోగులు

ఒంగోలు: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉద్యోగులు స్థానిక రెడ్‌క్రాస్ సంస్థలో గురువారం రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగర మేయర్ గంగాడ సుజాత, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.ప్రకాష్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఏపీజీబీ సేవలను కొనియాడారు. బ్యాంకు సేవలను విస్తృతం చేసేందుకు ప్రచారం మరింత పెంచాలన్నారు. రక్తదానం చేసేందుకు ముందుకు రావడం మంచి నిర్ణయమన్నారు. ఏపీజీబీ రీజినల్ మేనేజర్ హేమలత మాట్లాడుతూ 2006లో మూడు ప్రాంతీయ బ్యాంకులను కలిపి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేశారన్నారు. పది జిల్లాల్లో 551 శాఖలు కలిగి ఉందన్నారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని 5 మొబైల్ ఏటీఎంలను బ్యాంకు ప్రారంభించినట్లు తెలిపారు. ఇతర కమర్షియల్, ప్రైవేటు బ్యాంకులకు దీటుగా అన్ని రకాల ఆధునిక సౌకర్యాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

డార్విన్ సిద్ధాంతాన్ని పాఠ్యాంశంగా కొనసాగించాలి

- జేవీవీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు పుల్లారావు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

ఒంగోలు: డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని పాఠ్యాంశంగా కొనసాగించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు ఏవీ పుల్లారావు డిమాండ్ చేశారు. స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో గురువారం జేవీవీ జిల్లా కార్యవర్గ సమావేశం, సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ ప్రగతికి మూలం సైన్స్ అని, శాస్త్రీయ దృక్పథం మాత్రమే సమకాలీన ఆర్థిక, సామాజిక, సాంకేతిక సమస్యలకు పరిష్కారం చూపగలదని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రజ్ఞులు అంగీకరించిన డార్విన్ సిద్ధాంతాన్ని జీవశాస్త్ర పాఠ్యాంశాల నుంచి తొలగించడం వంటి చర్యలు విద్యార్థుల పరిశీలనాశక్తి, ప్రశ్నించేతత్వం, పరిశోధనలపై ఆసక్తి కోల్పోవడానికి కారణమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కుర్రా రామారావు, కె.సుబ్రహ్మణ్యాచారి మాట్లాడుతూ శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం 35 సంవత్సరాల క్రితం జేవీవీ ఏర్పాటైందని, జేవీవీ చేస్తున్న కృషిలో ప్రజలు మిక్కిలిగా భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం జేవీవీ సభ్యత్వ నమోదు ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించి పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ నెల 30వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాజాహుస్సేన్, నాయకులు వి.మాలకొండారెడ్డి, కె.నారాయణ, నల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్ఎండీ రఫీ, వి.వెంకటేశ్వర్లు, ఎన్‌టీ వెంకటేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సుస్థిరాభివృద్ధిని సాధించాలి



ఆర్పీలకు శిక్షణ ఇస్తున్న మెప్మా అధికారులు



శిక్షణ పూర్తి చేసుకున్న మార్కాపురం మెప్మా ఆర్పీలు

చీమకుర్తి: స్వయం సహాయక సంఘాల మహిళలు సుస్థిరాభివృద్ధి సాధించే విధంగా రిసోర్స్ పర్సన్‌లు కృషి చేయాలని మెప్మా పీడీ టీ రవికుమార్ అన్నారు. రెండు రోజుల నుంచి ఎండ్లూరు డొంకలోని మహిళా ప్రాంగణంలో మార్కాపురానికి చెందిన రిసోర్స్‌పర్సన్లకు ఇస్తున్న శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి పీడీ రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సంఘాలు, సమాఖ్యల నిర్వహణలో పంచసూత్రాలను విధిగా పాటించాలన్నారు. ప్రతి మహిళ స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణాలు, ఆసరా వంటి పథకాల ద్వారా కచ్చితమైన జీవనోపాధి పొందే విధంగా చైతన్యం తీసుకురావాలని ఆదేశించారు. సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలు కల్పించే విధంగా రిసోర్స్‌పర్సన్లు చురుగ్గా వ్యవహరించాలని పీడీ రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.